నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్, జూన్ 18 : నేడు శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ షేక్‌భాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలోని వివేకానంద ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏకే టౌన్‌షిప్, వివేకానందకాలనీ,నార్త్ గేట్, గ్రీన్‌వెన్యూబాల యేసుకాలనీ, వెల్లంకినగర్, ఏ1టౌన్‌షిప్,అక్బర్ కాలనీ, సాదత్‌కాలనీ,పాతపోలీస్‌స్టేషన్,బృందావన్‌కాలనీ,మక్తబ హదూర్‌అలీ, బుచ్చిరెడ్డి కాలనీ..
మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రుద్రకాలనీ, కాపుగడ్డ, మెహిదిగార్డెన్, సూరజ్‌గార్డెన్,అరవింద్‌కాలనీ, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో వరకు పూర్తిగా నిలిపివేస్తామని ఆయా కాలనీల ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

ఇరుదేశాల మైత్రికి దోహదం

ఖైరతాబాద్, జూన్ 18 : దశాబ్దాలుగా ఇరుదేశాల మధ్య ఉన్న వైరాన్ని తగ్గించి మైత్రికి పెంపొందించేందుకు చైనా పర్యటన దోహద పడిందని భారత్– చైనా మిత్రమండలి జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎం. మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల 11 మంది భారతీయ వైద్య బృందం చైనాను సందర్శించిందని, కుమ్మింగ్, గుయాంగ్, బీజింగ్ నగరాలతో పాటు గుయిజా ప్రావిన్స్‌ని షిబింగ్ జిల్లాలోని అనేక గ్రామాలను సందర్శించిందన్నారు. అక్కడ వైద్య విధానం తీరు తెన్నులు, నూతన పరిశోధనలను పరిశీలించిందన్నారు. వైద్య రంగంలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కోసం ఈ పర్యటన దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య 120 బిలియన డాలర్లకు పైగా వాణిజ్యం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ ఎస్. జతిన్ కుమార్, డాక్టర్ పి. విష్ణుప్రియ రావు, డాక్టర్ సాయి సుధాకర్, డాక్టర్ ఎం. జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం

ఖైరతాబాద్: తాను మరణిస్తూ మరొకరికి జీవన దానం చేశాడు. జీవన్‌దాన్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.... రంగారెడ్డి జిల్లా కొత్తపేట మండలం లక్ష్మీ నగర్ కాలనీకి చెందిన రాహుల్ పటేల్ (35) ఇంట్లో ఉండగా ఈ నెల 12న వాంతులతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 17న బ్రెయిన్ డెడ్ గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం సేకరించారు.

శంషాబాద్ రైతులకు ‘భరోసా’ ఏది..!

ఏడాదిగా రైతన్నల ఎదురుచూపులు

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్

శంషాబాద్ రూరల్, జూన్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపతిగా చెప్పుకుంటూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శంషాబాద్ మండల రైతులకు మొండిచేయి చూపించారు. యాసంగి సీజన్‌లో పెట్టుబడి సాయం అందించని ప్రభుత్వం వానకాలంలోనైన అందిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్న రైతులకు మరోసారి నిరాశనే మిగిలింది. 10 గుంటలు, 20 గుంటలు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులను రాజులు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నారు. గతంలో కేసీఆర్ పాలనలో ఎవ్వరు ఇబ్బందులు పడకుండా ఉండాలనే లక్ష్యంతో రైతులకు రెండు పంటలకు పెట్టుబడి సాయం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15వేల పెట్టుబడి సాయం అందిస్తామని అధికారంలోకి వచ్చిన వెంటనే మాటమార్చి రూ.12వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ..ఇప్పుడు ఆ రూ.12 వేలు కూడా ఇస్తలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సీజన్ల నుంచి శంషాబాద్ మండల రైతులకు పెట్టుబడి సాయం అందడంలేదు. గతంలో మండలంలో 9వేల మంది రైతులకు రైతు బంధు వస్తే రేవంత్ సర్కార్‌లో ఒక్క రైతుకు కూడా రైతు భరోసా రాలేదని మండల వ్యవసాయ అధికారి శ్వేత పేర్కొన్నారు.

పెట్టుబడి ఎగ్గొటిన రేవంత్ సర్కార్

రైతులకు కేసీఆర్ బిచ్చిమేస్తున్నట్లు కాదు మేము అధికారంలోకి వస్తే రెండు పంటలకు 15వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మాటమార్చి 12వేలకు కుదించారు. అవి కూడా శంషాబాద్ మండల రైతులకు అందని ద్రాక్ష లాగా అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ మండల రైతులకు రెండు పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొటింది.

గౌతమ్ రైతు, సహకార సంఘం డైరక్టర్

నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ నాయకులు రైతులకు అదిచేస్తాం ఇది చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే రైతులను నట్టేట ముంచారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో నాకు రెండు పంటలకు సీజన్ ప్రారంభమైన వెంటనే ఎలాంటి ఎదురుచూపులు లేకుండా రైతు బంధు వచ్చింది. నేను నాకున్న రెండు ఎకరాల 13 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకొని హాయిగా ఉన్న.

బాలయ్య, రైతు పెద్దతూప్ర

సమస్యల పరిష్కారానికి కృషి

బండ్లగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ, జూన్ 18: ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏడు కోట్ల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ మున్సిపాల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజ్ కుమార్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, అస్లాం బిన్ అబ్దుల్లా కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐఎంసీలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

ఖైరతాబాద్, జూన్ 18 ; లక్డీకాపూల్లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కామర్స్ కళాశాలలో ఈ నెల 19న మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. డిగ్రీ బీబీఏ, బీఎస్సీ, బీకామ్ (బిజినెస్ అనలిటిక్స్, కంప్యూటర్స్, హానర్స్) కోర్సలలో అడ్మిషన్ పొందగోరే ఇంటర్ విద్యార్థుల కోసం తెలంగాణల్లో మొదటిసారిగా ఈ టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. జనరల్ ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బేసిక్ కామర్స్ కు సంబంధించిన అంశాలపై టెస్ట్ ఉంటుందన్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఎలాంటి ఫీజు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇతర వివరాల కోసం www.iimchyderabad. కామెంట్ వెబ్ సైట్, 9989220163, 9010770605 నంబర్ల లో సంప్రదించాలన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్

అమలు చేయాలి

హిమాయత్ నగర్, జూన్ 18: కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాకముందు ఈ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్యా నాయుడు ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వానికి కులగణనపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపాలన్నారు. 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు తేలకపోయినప్పటికీ పార్టీ పరంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ముందుకెళ్లాలనే ఆలోచనలో ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్న విషయాన్ని రేవంత్ ప్రభుత్వం గుర్తించాలని ఎట్టి పరిస్థితుల్లో బీసీలను మోసం చేయడం తగదన్నా రు.42 శాతం రిజర్వేషన్ ప్రకటించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

23న చలో రాజ్ భవన్ ను విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్ నగర్, జూన్ 18:ఆపరేషన్ కగార్ ను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న జరిగే చలో రాజ్ భవన్‌ను కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ,రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర యువతకు పిలుపు నిచ్చారు. ఆ కార్యక్రమంకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులతో శాంతి చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను,మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వ హత్య చేస్తుందని ఆరోపించారు. ఒకవైపు ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మావోయిస్టులు కేంద్రంతో చర్చలు జరుపుతాం, శాంతి యుతంగా సమస్యను పరిష్క రిద్దాం, ఆయుధాల విషయాన్ని సైతం చర్చిద్దామంటూ కేంద్ర ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేయడంతో పాటు లేఖలు రాశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్,షేక్ మహ మూద్, మాజీద్ అలీ ఖాన్, మోసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

బండ్లగూడ జూన్ 18: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్, ఎంటమాలజీ విభాగం అధికారి నామాల శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. బుధవారం బుద్వేల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారు దోమలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుకునీరు నీరు నిల్వ ఉండడం ద్వారా అందులో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలనారు.

బుద్వేల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దోమల పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాగంటి చిత్ర పటం వద్ద మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి

సాయిబాబా నగర్‌లో..

మధురానగర్‌లో..

సైట్–3 కాలనీలో..

దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ శ్రద్ధాంజలి కార్యక్రమాలను బుధవారం బోరబండలోని పలు చోట్ల నిర్వహించారు. స్థానిక బస్ టెర్మినల్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. మాగంటి చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన గోపీనాథ్ లేని లోటు తీరనిదని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సాయిబాబా నగర్, మధురానగర్, సైట్–3 సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో కూడా మాగంటి గోపీనాథ్ శ్రద్ధాంజలి కార్యక్రమాలను నిర్వహించారు. – ఎర్రగడ్డ, జూన్ 18:

యూసుఫ్ గూడలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ పాల్గొని మాగంటి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.–జూబ్లీహిల్స్

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు

బండ్లగూడ, జూన్ 18: తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మారుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సభ్యులు రమేష్ గౌడ్ లక్ష్మీ నివాస్, యాదగిరిలు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యాహక్కు చట్ట ప్రకారం పాఠశాలల ముందు ఉన్నటువంటి టెక్నో టాలెంట్ గ్రామర్ వీటిని వెంటనే తొలగించాలన్నారు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 17 ప్రకారం బాలలను శారీరకంగా మానసికంగా ఇబ్బంది పెట్టకూడదని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా సెలవు రోజుల్లో స్కూల్ నడుపుతున్నా జిల్లా , మండల స్థాయి విద్యాధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు నోటు బుక్కులు అమ్ముతున్న పాఠశాలలను విద్యాధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టించినా ఫలితం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలు మధ్యతరగతి కుటుంబాల ఆశలను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయల దోపిడీ చేస్తున్నారన్నారు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భయం గుప్పెట్లో బడి పిల్లలు

మందుబాబుల చేతుల్లో బడి పిల్లల బస్సుల స్టీరింగ్

ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడ్డ స్కూల్ బస్సు డ్రైవర్లు

పాఠశాల బస్ డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ పోలీసులు

వెంగళరావునగర్, జూన్ 18 : ఆగండాగండి..మీ పిల్లల్ని ప్రైవేట్ బడికి బస్సులో పంపిస్తున్నారా..అయితే మీ బిడ్డలు జర భద్రం.. బడి బస్సుల్ని నడిపే డ్రైవర్లు మద్యం తాగిన మత్తులో నడిపి పిల్లల ప్రాణాలతో లగాటమాడుతున్నారు.పీకల దాకా మద్యం తాగిన మత్తులో పసిపిల్లల బడి బస్సుల్ని నడుపుతూ ఇద్దరు డ్రైవర్లు ..ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడటంతో పిల్లల తల్లిదండ్రుల గుండెలపై బండరాయి పడినట్లైంది. ఎస్.ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు అమీర్‌పేట మైత్రీవనం,యూసుఫ్ గూడ బస్తీ లో ఆకస్మికంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. క్వీన్స్ ప్రిజం స్కూల్ బస్సు డ్రైవర్ కేశవ్ కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 156 పాయింట్ల మద్యం రీడింగ్ నమోదైంది. దాంతో పిల్లల్ని బస్సుల్లోంచి కిందకు దింపి బస్సులను సీజ్ చేశారు. అలాగే యూసుఫ్ గూడ బస్తీ లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో శ్రీ చైతన్య స్కూల్ బస్సు డ్రైవర్ శివారెడ్డి కూడా తాగిన మైకంలో నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. డ్రైవర్ శివారెడ్డికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా అతనికి 202 పాయింట్ల మద్యం రీడింగ్ వచ్చింది. ఇద్దరు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి..రెండు పాఠశాలలు బస్సులను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మైలార్దేవ్ పల్లి, జూన్ 18: ఉడంగడ్డ రైల్వే ట్రాక్ వద్ద రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సంతోష్ నగర్ మాదన్నపేట్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ మజీద్ (45) బుధవారం ఉడంగడ్డ రైల్వే ట్రాక్ దాటుతున్నాడు. అదే సమయంలో అట్టుగా వచ్చిన రైలు మహమ్మద్ అబ్దుల్ మజీద్ ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలకు గురై అక్కడకక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి విషయాన్ని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, కాచిగూడ రైల్వే స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక..

సెంట్రింగ్ కార్మికుడు మృతి

శంషాబాద్ రూరల్, జూన్ 18 : అప్పుల బాధ భరించలేక సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా కుబీర్ మండలం అనంతారితండాకు చెందిన ఇందుల్ చావన్(45) భార్యా పిల్లలతో కలిసి శంషాబాద్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. నికి వలసవచ్చి జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది కూతురు వివాహం చేయడంతో వారికి అప్పులు అధికమయ్యాయి. దీంతో అప్పల బాధ భరించలేక మంగళవారం రాత్రి ఉరివేసుకొని మృతి చెందారు. అతడు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

హిమాయత్‌నగర్: మానవులు నిత్యం యోగా, జాగింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని రిటైర్డ్ ఏఎస్పీ సర్దార్ హరిహర్ సింగ్ అన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో అమిత్ సింగ్ తో కలిసి సర్దార్ హరి హర్ సింగ్ మాట్లాడుతూ ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికి యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాగంటి గోపీనాథ్ మరణం తీరనిలోటు

– సంస్మరణ కార్యక్రమానికి భారీగా తరలి వచ్చిన బీఆర్ఎస్ నేతలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీతో పాటు నియోజకవర్గం ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠా గోపాల్‌తోపాటు బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమం బుధవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించగా.. గ్రేటర్ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలతోపాటు ఇతర నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి గోపీనాథ్‌కు నివాళులర్పించారు. – బంజారాహిల్స్

అమెరికా అగ్రివర్సిటీతో ఒప్పందం ఎంతో లాభం



అమెరికా ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న ప్రొఫెసర్లు

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 18: అమెరికా కాన్సస్ స్టేట్ యూనివర్సిటీతో ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం పునరుద్ధరణ ఎంతో లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. 1964లో ప్రస్తుత వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైన సమయంలో కాన్సస్ విశ్వవిద్యాలయం సహకరించిందని వివరించారు. 70 ఏండ్ల కిందట రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల, వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని 17 మంది ప్రొఫెసర్లకు పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించి మానవ వనరుల అభివృద్ధికి సాయం చేసిందని జానయ్య తెలిపారు. డిజిటల్ వ్యవసాయ కేంద్రం, సహజ వనరులు, పర్యావరణ కేంద్రానికి సంబంధించిన పరిశోధనాశాలకు కాన్సస్ విశ్వవిద్యాలయం పూర్తి సహకారం అందిస్తుందని జానయ్య వివరించారు. కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధికి సహకరిస్తున్నారు. పీజీ విద్యార్థులకి, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలకు 6 నెలల్లోపు ఆయా రంగాల్లో శిక్షణ అందించడానికి కాన్సస్ విశ్వవిద్యాలయం అంగీకరించిందని జానయ్య పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలకి అధునాతన సాగు పద్ధతులు, పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిందిగా ఉపకులపతి అల్దాస్ జానయ్య చేసిన సూచనకు కాన్సస్ విశ్వవిద్యాలయం అంగీకరించింది.

భార్యపై కత్తితో దాడి – భర్తపై కేసు

బంజారాహిల్స్, జూన్ 18: కుటుంబ కలహాల్లో భార్యపై కత్తితో దాడి చేసిన భర్త మీద జూబ్లీహిల్స్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..గుంటూరు జిల్లాకు చెందిన అరుణ్ ప్రసాద్, జయలక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నారు. అరుణ్ ప్రసాద్ నిర్మాణ రంగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.
కాగా బుధవారం మధ్యాహ్నం మరోసారి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది . మాటామాట పెరగడంతో ఆగ్రహానికి గురైన అరుణ్ ప్రసాద్ తన భార్య జయలక్ష్మి మెడ మీద కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు అరుణ్ ప్రసాద్ మీద హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్కింగ్‌లో గొడవ

న్యాయవాదికి తీవ్రగాయాలు

వెంగళరావునగర్, జూన్ 18 : అపార్ట్ మెంట్ ముందు కారు పార్కింగ్ చేయడంపై చెలరేగిన వివాదంలో ఓ న్యాయవాదిపై వాచ్‌మెన్ తనయుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఎస్.ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..అంబర్‌పేటకు చెందిన ప్రదీప్ అనే యువకుడు మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చాడు.బీకేగూడ సీనియర్ సిటిజన్స్ కార్యాలయం ఎదురుగా విందు ఏర్పాటు చేయగా ప్రదీప్ స్నేహితులు అంబర్‌పేటకు చెందిన న్యాయవాది శివప్రసాద్ (25) శ్రీకాంత్ అనే మిత్రుడితో పాటు మరో ఇద్దరు యువకులు విందుకు వచ్చారు.కారును సమీపంలోని ధనలక్ష్మి అపార్ట్మెంట్ ఎదురుగా రోడ్డుపై నిలిపారు.భోజనాల అనంతరం కారు వద్దకు వచ్చారు.కారు తీయడానికి వీలు లేకుండా ఆటో అడ్డుగా ఉండటంతో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ శ్రీనివాస్ వద్దకు వెళ్లి ఆటో ఎవరిదని అడగగా వాచ్‌మెన నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు.అంతేకాకుండా వాచ్‌మెన్ కొడుకు హరీష్ (19)కత్తెర తీసుకుని శివప్రసాద్ తలపై పొడిచాడు.తీవ్ర గాయమై రక్త స్రావం జరగడంతో చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని,ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 18: మొక్కలు నాటి సంరక్షించినప్పుడే భావితరాలకు మనం అందించే గొప్ప సంపద అని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్‌లు అన్నారు. అమ్మకు ఒక చెట్టు అనే నినాదంతో బుధవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటి నీరుపోశారు.



ప్రారంభం: అత్తాపూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న బుధవారం కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి